


పాడమంటే పాడేది పాట కాదు. ఆడమంటే ఆడేది ఆట కాదు. నవ్వమంటే నవ్వేది నవ్వు కాదు అంటూ సవాలక్ష "కాదు"లు చెబుతారు. నిజమే. దానంతట అది పెల్లుబికి రావడంలో వున్న సహజత్వం ఆంక్షలకీ ఆర్డర్లకీ లొంగివస్తే ఏం బావుంటుంది?

పత్రికల్లో చాలా రకాల ఫొటోలు చూస్తుంటాం. రాయి పాతేరనీ, మొక్క నాటేరనీ, రిబ్బను కత్తిరించేరనీ ఇట్లాగే ఎందరో ప్రముఖుల ఛాయాచిత్రాలు ("వర్కింగ్ స్టిల్స్ అందామా?") పత్రికల్లో గమ్మత్తుగా వుంటాయి. రిబ్బను కత్తిరించే వ్యక్తి వెనక సహజంగా ముగ్గురో, నలుగురో ("కత్తిరించే వారిని బట్టి") సత్రకాయలు వుంటారు. ఫొటో తీస్తారనే

ప్రాథమిక సూత్రం వాళ్ళందరి బుర్రల్లోనూ అప్పుడు పనిచేస్తుంటుంది. నేను బాగా కనిపించాలంటే, నేననే వారి పోటీ, మెంటాలిటీ బొమ్మల్లో స్పష్టంగా చూడొచ్చు. ముందు వాడి భుజమ్మీద వెనక వాడి తల వుంటుంది. రెండు చేతుల్తో అటు వారినీ ఇటు వారినీ తోసేస్తూ, ఒకాయన సెంటర్లోకి వచ్చేస్తాడు. పక్కనుంచి దూసుకొచ్చి ఫ్రేములో తల పెడతాడు మరొక ప్రబుద్ధుడు. ఈ విచిత్ర విన్యాసం బొమ్మలోపడి వాళ్ళ పోటి కాంప్లెక్సు రికార్డవుతుందని తెలిసినా వాళ్ళ బలహీనత దాన్ని మింగేస్తుంది.

కాని ఉపన్యాసాల ఫొటోలు యిట్లా వుండవు. ఎప్పుడు ఫొటో తీస్తారో తెలియదు గనుక వేదికమీదున్న మహాశయులు వాళ్ళ వాళ్ళ గొడవల్లో వుంటారు. అందుచేత ఈ తాలూకు ఛాయాచిత్రాలు సహజ సౌందర్యాన్ని వలకబోస్తుంటాయి. మైకు దగ్గిర వక్త ఏడుస్తున్నట్లూ, సభాధ్యక్షుడు నిద్రపోతున్నట్టూ, ఒకరు తలపట్టుకొని మరొకరు కణతలు పట్టుకుని, ఇంకొకరు ముక్కు గోక్కుంటూ మనకి ఫొటోలో దర్శన మిస్తారు. ఈ గ్రూప్ ఫొటో చూడగానే ఆ ఉపన్యాసం ఎంత బాగా రంజుగా సాగివుంటుందో మనం ఈజీగా పోల్చుకోవచ్చు.

అల్లాగే దండలు వేసేటప్పుడు నానా బీభత్సంగా వుంటుంది. దండ వేసే అతనూ, వేయించుకునే అతనూ దండని మరచిపోయి కెమెరా వేపు గుడ్లప్పగించి పిచ్చిమొహాలతో చూస్తుంటారు. బహుమతులు తీసుకునే టప్పుడు కూడా ఈ తంతు ఇట్లాగే జరుగుతుంది. పొరపాటున కెమెరా ఫ్లాష్ వెలక్కపోయిందో దుంప తెంచేశారన్నమాటే. వేసినదండ తీసుకుని, తీసుకున్న బహుమతి యిచ్చి మళ్ళీ సిద్ధమవుతారు ఫొటోకి.

ఆ మాటకొస్తే ఫొటో దిగడం పెద్ద కసరత్తని నా అభిప్రాయం. మనం నవ్వితే బావుంటామని ఫొటో తీసే మనిషి చెబుతాడు. నిజమో కాదో వదిలేయండి. నవ్వడమెట్లా? కొంచెం....యింకా....మరికొంచెం అని అతను

హెచ్చరిస్తున్నప్పుడల్లా మన పెదాలు సాగుతుంటాయి. అది నవ్వు అని ఎట్లా చెప్పగలం? పెదాలు సాగుతుంటే మరో పక్క కళ్ళు మూసుకు పోతుంటాయి. దవడలు పీకుతుంటాయి. ఆ పది నిముషాలూ మొహమ్మీది నరాలు నొప్పెక్కి యమబాధ పెడతాయి.

ఫొటోల్లో రకరకాల ఫోజులుంటాయి. దవడ కింద చెయ్యి పెట్టి ఆలోచనా ముద్ర రచయిత ఫోజు. స్టూడియో వాడిచ్చిన పాతకోటూ, టై, (కంపు కొట్టినాసరే) తొడుక్కుని ఖరీదుగా కనిపించే ఫోజు, ఇంటర్వ్యూ ఫోజు, అట్లా కూచుని ఇట్లా లేచిపోయేది పాస్‌పోర్టు ఫోజు, సినీనటులు కావలెను ఫోజు, పెళ్ళి చూపుల ఫోజు, పిల్లగాలి ఫోజు, విదేశీ యాత్ర ఫోజు, నరముల బలహీనత డాక్టరు రాక ఫోజు, హస్తసాముద్రిక దైవజ్ఞ శిఖామణి ఫోజు, బివేరాఫ్ హిమ్ ఫోజు — ఇట్లా ఎన్నో స్టాండర్డు ఫోజులు మనం చూస్తూనే వున్నాం.

కొందరు చెక్కస్కూటర్లెక్కి ఫొటోలు దిగుతారు. కొందరు నల్ల కళ్ళజోడుతో స్టుడియో చందమామ నెక్కి పళ్ళికిలిస్తారు. కొందరు స్టేజీ నటులు యమధర్మరాజు వేషంతో సరాసరి స్టూడియోకి వచ్చేస్తారు. ఇప్పుడు కనిపించడం లేదుగాని విరల్ క్రాఫ్పుతో నోట్లో సిగరెట్టుంచుకుని చేత్తో సీసా పట్టుకుని మహా పకడ్బందీగా వుండే ఫోజులు మునుపు బాగా ప్రచారంలో వుండేవి.

నిజం చెప్పాలంటే ఎవరి ఫొటో చూసినా నాకు గొప్ప నవ్వులాటగా వుంటుంది. ఆ ఫోజు అట్లా రావడానికి ఆ మహాశయుడు ఎంత అలసిపోయాడోగదాని జాలిగా వుంటుంది. నా ఫొటో చూసుకొన్నప్పుడల్లా కూడా నా కష్టం నాకు గుర్తు వస్తూనే ఉంటుంది.

కాని, అన్నెంపున్నెం తెలీని పసిపాపల ఫొటోలంటే నాకు చాలా యిష్టం. వాళ్ళ నిష్కల్మషమైన చూపు యిష్టం. వాళ్ళ చిలిపి కళ్ళిష్టం. బోసినోరిష్టం. ఆ మొత్తం బొమ్మే నాకు ఎంతెంతో యిష్టం.

ఒక మళయాళీ రచయితని మదరాసులో పరిచయం చేసేడు తెలుగు ఫ్రండు. నేనూ, మళయాళీ రచయితా యిప్పటికీ ఉత్తరాలు వ్రాసుకుంటూనే వున్నాం. అతని ఫొటో పంపమని మొన్నీమధ్య వ్రాసేను. పంపేడు. కానీ, అది ఏణ్ణర్ధం పసివాడి ఫొటో. ఎంతో ముద్దుగా వున్నాడు. ఉత్తరంలో నాలుగే వాక్యాలున్నాయి. "ఈ ఫొటోలో వున్నది నేనే. కల్మషమెరుగని ఆ నవ్వూ, ఆ నిశ్చింత పెరిగి పెద్దవాడవుతున్న కొద్దీ మరుగున పడుతున్నాయి. ఇప్పటి ఫొటో నేను పంపినా, మీ ఆల్బమ్‌లో అతికించుకున్నా మనిద్దరికీ సిగ్గుచేటు. ఇది దాచుకోండి. నా కదే తృప్తి."

ఎంత అందంగా చెప్పుకున్నాడు. అవును మరి అతను రచయిత.